రేపటి నిజం

అచ్చు పోసుకుంటున్న దినపత్రికలా వుంది... బుర్ర.

రాత్రంతా నిద్రలేదు. ఉసిళ్ళ తెరలా ఒకటే ఆలోచనలు!

***

తాంబూలాలిచ్చేశాం, తన్నుకుచావండి, అన్న తీరుగావుంది యాజమాన్యం ధోరణి!

***

ఇద్దరు కలిస్తే అదే విషయం! ముగ్గురు మాట్లాడుకుంటే అదే సంగతి! నలుగురు కూడితే అదే చర్చ!

అప్పుడెప్పుడో...వచ్చేసిందన్న... అష్ట గ్రహ కూటమికి ముందు రోజు వాతావరణం! ఆఫీసులు జరుగుతున్నాయే కానీ; పెళ్ళివారు ఖాళీ చేసి పోయిన కళ్యాణ మంటపం వాలకంగా వున్నై.! ప్రతీరోజూ అదే తీరు!

వాలంటెరీ రిటైర్‌మెంట్ పథకం గురించి వ్యాఖ్యలూ, వ్యాఖ్యానాలూ, చర్చలూ, విశ్లేషణలూ జోరుగా సాగిపోతున్నై. ఎవరికి వారు వెళ్ళిపోతే ఎంత లాభం, ఎంత నష్టం అని, లెక్కలూ, బేరీజులూ వేసుకుంటున్నారు. కంపెనీ వాతావరణమంతా... మామిడిపళ్ళ గోడౌన్‌లా తయారయింది. అంతా మాగిన వాసన కొట్టోంది!

***

నిజానికి ఈ కథకి సూత్రధారి రామదాసు. అతను సూదిలాంటివాడు. మేమంతా పూసలం. కాదంటే నేను దారాన్నవుతానేమో! అసలు జరిగింది చెప్తాను.

అంతకంటే ముందు ప్రసాద్ కేసి చూద్దాం.

ప్రసాద్‌ని దసరా బుల్లోడు అంటూ వుంటారు మా మిత్రులు చాలా మంది. మనిషి ఇస్త్రీ మడతలా వుంటాడు. మెళ్ళో గోల్డ్‌ఛెయిన్, రెండు చేతులకీ కలిపి మూడు రింగ్స్; ఎడమ ముంజేతికి గోల్డ్ వాచ్, కళ్ళకి బంగారు ఫ్రేమ్ జోడు. నడకలో, మాటలో స్పీడు. పదిహేనేళ్ల క్రితం ప్రతి జీతం రోజునా ఆఫీస్ ఎగ్గొట్టేవాడు. అప్పట్లో అప్పుల బాధ అలాంటిదీ. ఆ తర్వాత దశ తిరిగింది.

***

నిదానంగా దగ్గరగా వచ్చాడు రామ్మూర్తి.

"నిజంగా జరుగుతుందంటావా?" అడిగేడు. ఎల్.ఎ.సి. దగ్గర నిలబడ్డ సైనికుడిలా ఉన్నాడు. నేను సూటిగా కళ్ళల్లోకి చూసే సరికీ చూపులు మరల్చుకున్నాడు.

"అనే అంటున్నారు కదా!" నేను యధాలాపంగా అన్నాను.

"అమలు చేస్తారంటావా?" నేను ముభావంగా వూరుకున్నాను. రామ్మూర్తి ప్రశ్నను చంద్రయ్య విన్నాడు, "కూడికలూ, తీసివేతలూ, హెచ్చవేతలూ, భాగహారాలూ వడివడిగా జరిగిపోతున్నై. మరో పక్కన... బయటకు పోతే ఎందుకు పనికొస్తామా అంటూ తమతమ బలాబలాల లిష్టులూ తయారౌతున్నై."

మేం మాట్లాడకుంటున్నాం. అదుగో అపుడు వచ్చాడు.... రామదాసు. మేమంతా మొహమొహాలు చూసుకున్నాం.

కుర్చీలో కూర్చున్నాడు. మనిషి బాగా నీరసంగా కనిపిస్తున్నాడు. చాలా దూరం నుంచీ, నడిచి వచ్చినట్లున్నాడు. మొహాన్న చెమట పట్టివుంది. కండువాతో మొహం తుడుచుకున్నాడు.

"అందరికీ నమస్కారం" అన్నాడు.

మా పెదవులు కదల్లేదు గానీ, తలలు ఊగినై. మరో క్షణం తర్వాత,

రామ్మూర్తి అన్నాడు.

"మన లాంటి వాళ్ళ కోసం.... ప్రసాద్ ఒక కన్సల్టెన్సీని ప్రారంభిస్తాడుట". చంద్రయ్యకి ముందున్న కుర్చీలోకి చేరేడు రామ్మూర్తి.

సంభాషణలోని ఉత్సుకత ప్రసాద్‌ని దగ్గరకి నడిపింది. అతనూ వచ్చాడు. స్టూలుని నా ముందుకు లాక్కుని మొదలెట్టాడు, ప్రసాద్.

"ఒక సంస్థని ప్రారంభిస్తాను నేను' ఎగ్జిట్ పాలసీ ఎఫెక్టెడ్ ఎంప్లాయీస్ ఎసోసియేషన్. అడ్మిషన్ ఫీజు కేవలం వంద రూపాయలు"

"అంటే నీ ఉద్యోగం సిద్ధం చేసుకున్నావన్నమాట" చంద్రయ్య నవ్వాడు.

"ఆ.. ఏం ఉద్యోగంలే... ఏదో కొంత మూలధనం వస్తుంది. దాంతో అడ్జెస్ట్ అయిపోతాను. రోజు వారీ సాదరు... ఎటూ పార్టీల ద్వారా జరిగిపోతూ వుంటుంది".

"కొంచెం మంచి నీళ్ళు కావాలి" రామదాసు అడిగేడు.

నేను అటూ ఇటూ చూశాను ఫ్యూన్‌కోసం. అతను కనిపించలేదు.

ప్రసాద్ అన్నాడు. "మీకు తెలుసుగా, ఆ వెనుక వసారాలో కూలర్ వుంది. వెళ్ళి తాగి రావాల్సిందే".

రామదాసు నెమ్మదిగా కదిలాడు. ప్రసాద్ కొంచెం విసుగ్గా, చిరాగ్గా అన్నాడు, "ఈయనకి వేరే పని లేదు. రోజూ తయారు. వద్దన్నా వినడు"

ప్రసాద్ మాటల్ని తుంచేస్తూ అందుకున్నాడు చంద్రయ్య.

"బయటికి నడవమంటే... సరాసరి రైలు పట్టాలా, హుస్సేన్‌సాగరా అని ఆలోచించాలి... నాలాంటివాళ్ళం. అంతే".

"మాస్టారూ అంతగా బెంబేలు పడకండి సార్. నేనున్నాను గదా. నో ప్రాబ్లమ్. చెప్తాను. ఉదాహరణకు... మీరు నాలుగు గైడ్స్ రాయండి. నేను

అచ్చేయించుకుని అమ్ముకుంటాను".

"ఆ.. మన గైడ్స్ కొనే వాళ్ళెవరండీ"

"ఓ.కె/ వద్దు... మీ ఇంటి ముందు 'ఇచ్చట జ్యోతిష్యం చెప్పబడును' అని బోర్డు కట్టండి. ఒక ఏడాది కాగానే ... నాతో మాట్లాడటానికి డైరీ చూసి చెప్తానంటారు"

అందరమూ నవ్వుకున్నాం.

"ఇవన్నీ జోక్సుకి తప్ప కూటికి గుడ్డకీ పనికి రావులే ప్రసాద్"

"ఆగండి. అక్కడే ఆగండి" చేతులు తిప్పుతూ చెప్పసాగేడు ప్రసాద్. "అలాగైతే... ఇది చూడండి. నేను మందుల షాపుకి లైసెన్స్ తెస్తాను. పెట్టుబడి పెడతాను. షాపు ప్రారంభిస్తాను. షాపులో ఒక పక్కగా... బుక్స్ లెండింగ్ సెక్షన్ వుంటుంది. ఈ రెంటికీ 'బాయిస్' వుంటారు. మీరు వాళ్లని చూసుకుంటూ వుండండి. మీ నెట్ శాలరీ నేనిస్తాను. సరేనా"

"ఇదేదో బాగున్నట్టే వుంది" చంద్రయ్య.

"కానీ జాబ్ సెక్యూరిటీ?"

"ఇప్పుడు కూడా అది లేకనే కదండీ... ఈ ఆలోచనలన్నీ"

"వెల్‌సెడ్". మళ్లీ సన్నగా నవ్వులు.

రామదాసు తిరిగి వచ్చాడు. కూర్చున్నాడు. ప్రసాద్ కేసి బెరుకు బెరుగ్గా చూశాడు. నాలికతో పెదవుల్ని తడిచేసుకున్నాడు. "నా సంగతి కాస్త ఇవ్వాళన్నా చూసి పెట్టు ప్రసాద్. అందుకే వచ్చాను".

ప్రసాద్ ఆయనవైపు ఆదోలా చూశాడు. "సార్. మీరు రిటైరయి నిండా నెల కాలేదు. రోజూ తిరుగుతున్నారు. మీ ముందు కేసులు చాలా వున్నై మా దగ్గర. ఒక వరసలో వస్తాం గదా. ముందుగా మీ బెనిఫిట్స్ సెటల్ చేసేస్తే, ఆ

ముందు వాళ్ళంతా ఏమై పోవాలి?"

రామదాసు నీరసపడ్డాడు. మొహం ముడుచుకున్నాడు. చాలా కోపం వచ్చింది. పళ్ళు బిగబట్టాడు... 'ఛీ' అనుకున్నాడు, సన్నగా. మరేమీ మాట్లాడకుండా నిగ్రహించుకున్నాడు.

నారాయణ కూడా నలుగురితో కలవడానికి నా పక్కకి చేరేడు. టేబుల్ మీదనే బైఠాయించాడు.

"ప్రసాద్ ఇంకేదైనా మంచి సలహా ఇవ్వవయ్యా" చంద్రయ్య.

"నో ప్రాబ్లమ్ ఎటాల్ సర్. ఇది చూడండి... ఎలా వుంటుందో. మీ కాంపౌండ్ వాల్‌ని పగల గొట్టించి చిన్న షెడ్ వేయండి.... వొక షెట్టర్‌తో. ఉదయాన్నే మిల్క్ సప్లై జరుగుతుంది. సాయంత్రం ఐదునుంచీ రాత్రి ఎనిమిది వరకూ ఇంచక్కా సొమాసాలు, బిస్కట్లూ, కేక్‌లు, చెకోడీలూ, టీ లభిస్తాయ్"

"అయ్య బాబోయ్. అంత డైవర్సిఫికేషన్ నావల్లకాదు".

"మీ వల్ల కానఖ్ఖర్లేదు మహాశయా. ఇవన్నీ... ఘనతవహించిన చంద్రయ్యగారి గదిలో ... విడివిడిగా ఎవరికి వారు నిర్వహించుకుంటారు. చంద్రయ్యగారికి రోజుకు కేవలం ఓ వంద అద్దెరూపేణా లభిస్తుంది. దట్సాల్. మీరు ఊ అనండి. సాయంత్రం మేస్త్రీకి కబురు చేస్తాను. మునిసిపాలిటీ గొడవంటారా...అదంతా నాకు వదిలేయండి. ఖర్చులు ఆ తర్వాత చెప్తాను. నగదుగా ఇవ్వండి. అంతే".

"బాగుంది... నీ బుర్ర నిజంగా సూరే కారమేనోయ్".

"ఇలాంటివి... కోటి విద్యల లిష్టు వుంది. కాకుంటే ఒక అడుగు ముందుకు వేసే దమ్ము కావాలి అంతే."

ఇప్పుడు నారాయణ అస్థిమితంగా కదిలాడు. అతని మొహం చెక్కుతీసిన

కందగడ్డలా అయింది. మనస్సులో చాలా ఆందోళన పడుతున్నట్టు తెలుస్తోంది. అడిగాడు, " ప్రసాద్. కాస్త నన్నూ వో కంట కనిపెట్టవయ్యా బాబూ"

ప్రసాద్ ముందుగా చుట్టూ చూశాడు. అందరూ ఉత్సుకతతో వింటున్నారు. అప్పుడు నారాయణవైపు చూశారు. అతను వరం కోరి రెస్పాన్సు కోసం చూస్తున్న భక్తుని ఫోజులో నిలబడి వున్నాడు. ప్రసాద్ చెప్పడం మొదలెట్టాడు.

" మీ కాలనీలో డిఐజి గ్రూపు అదే డబుల్ ఇన్‌కం గ్రూపు అదే ఉద్యోగం చేసే భార్యా భర్తలు.. వాళ్ళ జనాభా ఎక్కువే... అందుకని మీ ఇంట్లో ఉదయం 8 గంటలకు, రాత్రి 8 గంటలకు రెండు స్టీలు డ్రమ్ముల నిండా సాంబారు, రసం చేయించి పెట్టు. నాలుగు రోజుల తర్వాత.. నారాయణ ఇంటి ముందు... టైమైపోతోంది, నాకంటే నాకని తొక్కిసలాట మొదలౌతుంది. అపుడు క్యూని సరిచేసే సహాయం నే చేసి పెడ్తాను."

"రామ్మూర్తిగారూ. రాత్రి మీకు చెప్పాను కదా నా పరిస్థితి. చాలా అవసరంలో వున్నాను. కొంచెం హెల్ప్ చేయాలి" రామదాసు వేడికోలుగా అన్నాడు.

"వింటున్నాడు గదా మన ప్రసాద్ - మీ పనిని అతను చేయాల్సిందే మరి" ఇదీ రామ్మూర్తి. రామదాసు అందరికేసీ 'నా సంగతేమిటి?' అన్నట్టు చూశాడు కానీ, ఎవ్వరూ అతన్ని పట్టించుకోలేదు.

"నిర్మలగారు ఏమీ మాట్లాడటం లేదు" ఉన్నట్టుండి రామ్మూర్తే అన్నాడు.

నా సీటుకి ఎడమ వైపు సీటు నిర్మలది. ఎవ్వరికేసీ చూడలేదు. సన్నగా నవ్వి తన పనిలో తాను నిమగ్నమైపోయింది నిర్మల.

ప్రసాద్ అన్నాడు. "నిర్మలగారికి ఈ అవసరమేం లేదు. ఆమె ఈ ఆఫీసు తలవాకిలి దాటాలే గానీ, కిందమెట్ల దగ్గరే ఎవరో వొకరు ఎగరేసుకుపోతారు".

అందరూ ఉలిక్కిపడ్డారు. నేనూ తిన్నగా ప్రసాద్ మొహం కేసి చూశాను. అతనేమీ కళవళ పడలేదు. చేతులూ, కళ్ళూ తిప్పుతూ, ఒక వింత విన్యాసంతో

వివరణ ఇచ్చాడు.

"అదే నా ఉద్దేశ్యం. ఆమె అర్హతలూ, అనుభవం, అన్నిటికీ మించి ఆమె ఎఫిషెన్సీ. శతకోటి ఉద్యోగాలు ఆమె ముందు చేతులు కట్టుకుని బారులు తీరతాయ్. ఆమె ప్రాబ్లమ్ అల్లా ఏ కంపెనీని ఎన్నుకోవాలా అనే. అవునా మేడమ్. యామ్ ఐ రైట్!"

ఆమె మళ్లీ అదే నవ్వు నవ్వింది. పాలు వంపితే పాత్ర అంచున మీగడ తరక జారినట్లు!

క్షణాల తర్వాత ప్రసాద్ వాచీ చూసుకున్నాడు. అప్పటికి నాలుగు దాటింది. "ఓకే బాస్. మైగోస్. నాకు వేరే పనులున్నై!" అంటూ తన సీటు దగ్గరికి నడిచాడు. మరో ఐదు నిముషాలకి చక చకా ఆఫీసు బయటికి వెళ్ళిపోయాడు.

ఆ వేళకి ఆఫీస్ పని అనే పదార్థం ఆ విధంగా ఉడికించబడింది!

***

వారం వెళ్లి వారం వచ్చింది.

సోమవారం ఉదయం. ఆ రోజు జీతం రోజు. జీతం రోజున ప్రసాద్ చాలా బిజీగా వుంటాడు. అతని 'అప్పుల కలెక్షన్స్' అతనికి పెద్ద పని. పన్నెండవుతుండగా రామదాసు ప్రసాద్ ముందు ప్రత్యక్షమయ్యాడు. మామూలు పరామర్శల తర్వాత... ప్రసాద్ ఎటో వెళ్లిపోయాడు. నిముషాలు గంటలుగా మారాయి. రామదాసుకి చాలా విసుగ్గా, చిరాగ్గా వుంది. చదివిన దినపత్రికనీ, చదవని వారపత్రికనీ చాలా సార్లు తిరగేశాడు. అప్పటికి రెండు మూడు సార్లు అటూ ఇటూ వెళ్ళి వచ్చాడు. లంచ్ అవర్ అయిపోయింది. రెండున్నరయింది. నాముందుకు వచ్చి కూచున్నాడు. "ఇదేమైనా బాగుందా శంకరంగారూ" అన్నాడు సన్నగా.

తలెత్తి ఆయనకేసి చూశాను. "నేను రాయిలా ఉదయం నుంచి ఇక్కడే కూర్చున్నాను. తానేమో నన్ను గమనించకుండా తిరుగుతూనే వున్నాడు. రెండోనెల జరుగుతోంది. పిల్ల పెళ్ళికి ముహూర్తాలు పెట్టుకోవాలి. పెళ్ళి వారిని నేనిచ్చే కట్నానికి చాలా కష్టపడి వొప్పించుకున్నాను. కొంత అడ్వాన్స్ తీసుకురమ్మంటున్నారు. ఇక్కడేమో ఇదీ తంతు"

నేను వింటున్నాను. "ఇంటా బయటా నా అసమర్థతని కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. మా పిల్లలకి కూడా నేను పెద్ద లాఫింగ్ స్టాక్‌గా మారాను"

"చెప్పాను కదా! చూస్తాడు లేండి".

"ఇవ్వాళ మా పెద్దవాడు మీకసలు నోట్లో నాలికే లేదు. మీరా ఆఫీస్ చుట్టూ ప్రదక్షిణాలు మానేయండి. నన్ను పోయి రానీయండి. ఏం జరుగుతుందో చూస్తాను... అంటున్నాడు".

రామదాసు మాటల్ని నేనూ, రామ్మూర్తి, చంద్రయ్యా, నారాయణా అందరమూ విన్నా, నిర్మల మాత్రం అదోలా రామదాసు వైపు చూసి "ఇట్టా రండి సారూ" అని పిల్చింది. వెళ్ళి ఆమె ముందు కూర్చున్నాడు రామదాసు. క్షణాల తర్వాత కాఫీలు వచ్చినై. ఇద్దరూ తాగేరు. మాటలు కలుపుకున్నారు. తర్వాత కొంత సేపటికి రామదాసు వెళ్ళిపోయాడు. వెళ్తూ వెళ్తూ "కాస్త మీరూ ఆ ప్రసాద్‌కి చెప్పండి శంకరంగారూ" అంటూ నన్ను మరోసారి అర్థించి వెళ్ళాడు.

రామదాసు వెళ్ళిన తర్వాత,

కొద్దిసేపటికి...

నిర్మల నా దగ్గరసా వచ్చింది. రామదాసు పని గురించి, ఆ వేళ జరిగిన చర్చల గురించీ చాలా మాట్లాడుకున్నాం మేము. నిర్మల మాట్లాడే తీరుకు ఆశ్చర్యం వేసింది నాకు. తన అభిప్రాయాల మీద నా సలహా అడిగింది. చెప్పాను.

***

మర్నాడు, రామదాసు మళ్లీ వచ్చాడు. సరాసరి వెళ్ళి నిర్మల ముందు కూర్చున్నాడు. వాళ్ళిద్దరూ ఒక అర్థగంట సేపు ఏదో చర్చించుకున్నారు. ఆ తర్వాత 'అలాగే...అలాగే' అంటూ వెళ్లిపోయాడు రామదాసు.

***

ఆ వేళ పదకొండు గంటలైంది. మా ఆఫీసు ముందు సుమారు యాభై అరవైమంది యువకులు గుమిగూడారు. వాళ్ళ చేతుల్లో ప్లేకార్డ్స్ వున్నై; ప్రజా సంక్షేమ సంఘం అనే బేనర్లూ వున్నై.

"ఆఫీసుల్లో అసమర్థత నశించాలి" "నో వర్క్... నో పే" "ఈ దోపిడీ ఇంకానా... ఇక పైసాగదు" "ఆర్గనైజ్డ్ లేబర్ పొగరణచక తప్పదు". "పని చేయని ఉద్యోగులు దేశద్రోహులు" .. ఇవీ నినాదాలు!

గేటు ముందు బైఠాయించారు. ఉద్యోగుల్లో చలనం. కొందరు పళ్ళు కొరుక్కున్నారు. కొందరు కోపంతో ఊగిపోయారు. కొందరు యూనియన్ లీడర్లు సర్ది చెప్పబోయారు. వాళ్ళు వినలేదు. కొందరు పోలీసుల్ని పిలవమన్నారు. మా యం.డీ. ఒప్పుకోలేదు. మా అధికార్లంతా బయటికి వచ్చారు. అసలు సమస్య ఏమిటో చెప్పమన్నారు. ఆ గుంపులో కొందరు నాయకుల్ని సంప్రదింపులకి లోపలికి రమ్మన్నారు. వాళ్ళల్లో వో ఐదారుగురూ, యూనియన్ లీడర్లూ, కొందరు అధికార్లూ, మా యం.డీ. రూమ్‌లోకి వెళ్ళారు. లోపల చాలాచాలా చర్చ జరిగింది. పార్టీల సొమ్ముని సత్వరం చెల్లించాలనీ, ఉద్యోగుల అలసత్వం పోవాలనీ డిమాండ్. ఉద్యోగుల్లో ప్రసాద్ లాంటి వాళ్ల పేర్లు బయటికి వచ్చినై.

ఆఫీసు సమయంలో వాళ్ళంతా పని చేయాలి. పెండింగ్‌లో వున్న పనంతా వారంలోగా పూర్తి కావాలి.... ఇదీ హెచ్చరిక!

నిర్మల ఒకరోజు సాయంత్రం నాతో అన్న మాటలు చప్పున గుర్తుకొచ్చినై నాకు, "రేపెప్పుడో బయటికి పోతే ఏమైపోతామో అని ఏడుస్తున్నాం గానీ, బయటికి పోయి ఏడుస్తున్నవాణ్ణి పట్టించుకోం మనం. అందుకే మనకు ఉంగరాల చేత్తో మొట్టే మొగుడు కావాలి". ఆ వేళ నిర్మల ఆమాటల్ని చాలా కటువుగానే అన్నది!

ఆందోళన చేస్తున్న యువకులకూ, మా ఉద్యోగులకీ మధ్య - చాలా రకాల వాద ప్రతివాదనల తర్వాత, ఒక అంగీకారం కుదిరింది. వారం తర్వాత పరిస్థితిని గమనిస్తామని హెచ్చరించి నెమ్మదిగా వెళ్ళిపోయారు.

***

ఆ వారంలో మా ఆఫీసులో పెద్ద మార్పే వచ్చింది. పాత ఫైళ్ళు కదలసాగినై.

రామదాసు వచ్చి తన చెక్కు తీసుకువెళ్ళాడు. ఆయన వచ్చినప్పుడు ప్రసాద్ మొహం తప్పించాడు. ఆ పనిని రామ్మూర్తి చూశాడు. రామదాసు వెళ్ళిపోయిన తర్వాత, రామ్మూర్తి యదాలాపంగా నన్ను అడిగాడు, "అవును శంకరం, ఆ సంఘం నాయకుడు, విశ్వం- మన రామదాసుగారి రెండో కొడుకుట గదా?" అని.

"అలాగా" అన్నాను, పొడి పొడిగా. పక్కకి చూస్తే... నిర్మల! తనలో తను నవ్వుకుంటున్నది!

నాలుగు రోజుల సెలవు తీసుకుంది, నిర్మల.

రామదాసు కూతురి పెళ్ళికి వెళ్ళాను. ఆ పెళ్ళిలో చాలా ఉత్సాహంగా పాల్గొన్నది నిర్మల.

పది రోజుల తర్వాత, తన పెళ్లి శుభలేఖని మా అందరికీ అందించింది నిర్మల. వరుడెవరో కాదు... రామదాసు రెండో కొడుకు విశ్వం!

నేనేమీ నిర్ఘాంతపోలేదు!!

నా ముఖ కవళికల్ని గమనిస్తూ అన్నాడు, ప్రసాద్, "ఈ నిర్మలతో జాగ్రత్తగా

ఉండటం మంచిది. బరితెగించిన ఆడది”

నాకనిపించింది “నిర్మల.. బరిగోల దాల్చిన ఆడది”!!!

కొన్ని సమస్యలకి పరిష్కారాలు నిర్మలలే చూపగలరేమో!!

అన్నట్టు, ఇప్పటికీ మా కంపెనీలో ఏ వాలెంటరీ రిటైర్‌మెంట్ పథకమూ ప్రవేశించలేదు!!!

***

(రచన సచిత్ర మాస పత్రిక ఆగష్టు 1994)